సాక్షి
విశాఖపట్నం
గురువారం । 28 । డిసెంబర్ । 2023



కప్ప చేప

ఉప్పాడ మత్స్యకారుల వలకు బుధవారం ఈ సముద్ర జీవి చిక్కింది. దీనిని కప్ప చేప అంటారని వారు తెలిపారు. ఇది తినడానికి పనికిరాదని.. అందుకే మళ్లీ సముద్రంలో వదిలేశామని చెప్పారు. - కొమ్మాది



ప్రభుత్వ లక్ష్యాలు నెరవేర్చాలి

రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా బ్యాంకర్లు ప్రజలకు సేవలందించాలని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున కోరారు. 8లో

మూడో గురువారం పూజలకు ఏర్పాట్లు



మార్గశిర మాసోత్సవ మూడో గురువారం కనకమహాలక్ష్మి అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు తగిన ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఈవో కె.శిరీష తెలిపారు. 8లో

సంక్షేమ ఖ్యాతి.. ఇంటింటా కాంతి



ఫించన్ అందజేస్తున్న వలంటీర్(ఫైల్)

2023లో పేదల జీవితాల్లో వెలుగులు
ప్రతీ కుటుంబానికి కొండంత భరోసా
సంక్షేమ పథకాలతో ఆర్థిక పరిపుష్టి



అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రజలను కంటికి రెప్పలా కాపాడుకుంటూ ఇంటింటా సంక్షేమ కాంతిని నింపింది. ఈ ఏడాది సంక్షేమ క్యాలెండర్‌ను విజయవంతంగా పూర్తి చేసింది. పలు ప్రతిష్టాత్మకమైన సంక్షేమ పథకాలు అమలు చేస్తూ అండగా నిలిచింది. పింఛన్లతో వృద్ధుల మోములో ఆనందం నింపింది. పేదల సొంతింటి కలను నెరవేర్చింది. చేతి, కులవృత్తులకు చేయూతనందించింది. వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలకు భరోసా కల్పించింది. రైతుభరోసాతో అన్నదాతకు ఆత్మబంధువై నిలిచింది. ప్రభుత్వ పాఠశాలలో కార్పొరేట్ స్థాయి విద్యను అందిస్తూ విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేసింది. నాడు–నేడు ద్వారా ప్రభుత్వ ఆస్పత్రులను అభివృద్ధి చేసి నాణ్యమైన వైద్యాన్ని చేరువ చేసింది. వనరులు, వసతులు సమకూర్చి కుల వృత్తులకు పూర్వవైభవం తెచ్చింది. అక్కా చెల్లెమ్మలకు ఆర్థిక భరోసాతో ఆనందం రెట్టింపు చేసింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల జీవితాలను మార్చేసింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన సంక్షేమ పథకాలతో 2023 సంవత్సరం.. తమ జీవితాల్లో చిరస్థాయిగా నిలిచిపోయిందంటున్నారు జిల్లా ప్రజలు. వారిలో కొందరి జీవితాలు 2023లో ఎలా మారాయో ఓసారి చుద్దాం.



విదేశీ విద్యా దీవెన మెగా చెక్కు అందజేస్తున్న కలెక్టర్(ఫైల్)

– సాక్షి, విశాఖపట్నం

జీతంలా పింఛన్ ఇంటికొస్తోంది



వయసు మీద పడింది. కాళ్లు నరాలు వాచిపోయాయి. ఏ పనీ చేయలేని పరిస్థితి. నా ముగ్గురు కుమారులకు వివాహాలు కావడంతో ఎవరి బతుకు వారు బతుకుతున్నారు. చిన్న కొడుకుతో కలిసి అక్కయ్యపాలెం శ్రామికనగర్‌లో పూరి గుడిసెలో నివసిస్తున్నాను. గత టీడీపీ పాలనలో పింఛన్ కోసం కాళ్లు అరిగేలా తిరిగాను. మూడుసార్లు దరఖాస్తు చేసినా పింఛన్ మాత్రం మంజూరు కాలేదు. సచివాలయ సెక్రటరీ మా కాలనీకి గత ఫిబ్రవరి నెలలో వచ్చినప్పుడు పింఛన్ రాలేదని చెప్పాను. దరఖాస్తు పెట్టమన్నారు. వలంటీర్ వచ్చి అప్లికేషన్ పెట్టారు. వారం రోజులు కూడా గడవక ముందే పింఛను మంజూరైంది. మార్చి నుంచి ప్రతి నెలా ఒకటో తేదీన జీతంలాగా ఇంటికే పింఛన్ వచ్చేస్తోంది. నా మందుల ఖర్చులకు, కిరాణా ఖర్చులకు ఎవరినీ అడక్కుండా దర్జాగా ఖర్చుపెట్టగలుగుతున్నాను. నా కుమారులకు ఇంటి స్థలం కూడా మంజూరైంది. జగన్‌బాబు చేసిన మేలు ఎన్నటికీ మర్చిపోలేను.

– టీకు ఎల్లాజీ, శ్రామికనగర్

సొంత ఇంటి కల నెరవేరింది



మాది నిరుపేద కుటుంబం. ఎలాంటి ఆస్తులు లేకపోవడంతో ఉపాధి లేక పదేళ్ల క్రితం ఆనందపురం మండలం, వెల్లంకికి విజయనగరం జిల్లా నుంచి వలస వచ్చేశాం. నా భర్త సింహాచలం ప్రైవేటు ఉద్యోగం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. మాకు ఇద్దరు పిల్లలు. ఇన్నాళ్లూ సొంత ఇల్లు లేక నెలకు రూ.2,500 అద్దె చెల్లించుకుంటూ బతుకీడుస్తూ వచ్చాం. టీడీపీ హయాంలో మూడుసార్లు దరఖాస్తు చేసుకున్నా పట్టించుకోలేదు. సీఎంగా వైఎస్ జగనన్న రాగానే కాలనీకి దరఖాస్తు చేసుకున్నాం. ఇల్లు మంజూరైంది. సకాలంలో ప్రభుత్వం బిల్లుల డబ్బులు అందించడంతో ఈ ఏడాది జూన్‌లో సొంత ఇంటి కల నెరవేరింది. అంతేకాదు జగనన్న చేయూత పథకం ద్వారా ప్రభుత్వం రూ.18,600లు అందజేసింది. ఇంటి అద్దెతో పాటు ఈ డబ్బులు వల్ల అప్పులు చేయాల్సిన బాధ తప్పింది. జగనన్నకు రుణపడి ఉంటాం.

– మరిశర్ల వెంకట సత్యవతి, వెల్లంకి

చేయూతతో ఆర్థిక భరోసా



మాది విశాఖ జిల్లా రుషికొండ గ్రామం. నా భర్త చిన్నప్పన్న ఆటో డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. మాకు ఇద్దరు పిల్లలు, బాబు రామ్‌చరణ్, పాప భావన. వీరిద్దరు ప్రస్తుతం ఇంజనీరింగ్ చదువుతున్నారు. ప్రస్తుతం అద్దె ఇంట్లో ఉంటున్నాం. ఆటోతో వచ్చే సంపాదన అంతంత మాత్రమే. ఇద్దరు పిల్లలను పెద్ద చదువులు చదివిస్తూ ఇంటి అద్దె కట్టుకుంటూ, బతుకు భారమవుతున్న తరుణంలో.. వైఎస్సార్ చేయూత ద్వారా ఈ ఏడాది వచ్చిన రూ.18,500 నగదు తొలి పెట్టుబడిగా దుస్తుల వ్యాపారం ప్రారంభించాను. ప్రస్తుతం వ్యాపారం చాలా బాగుంది. అద్దె కట్టుకోవడానికి, ఇతర ఖర్చులకు నా సంపాదన ఉపయోగపడుతుంది. మావారికి ఆర్థికంగా సహాయపడగలుగుతున్నాను.

– జి.అన్నపూర్ణ, చినరుషికొండ

అమ్మ ఒడితోనే బడికి..



నా పేరు బచ్చు స్నేహశ్రీ. మాది రైల్వే న్యూ కాలనీ. జీవీఎంసీ స్కూల్లో 8వ తరగతి చదువుతున్నాను. నాన్న కోవిడ్‌తో రెండేళ్ల క్రితం చనిపోయారు. అమ్మ సత్యవతి హోటల్‌లో పనిచేస్తూ, మమ్మల్ని చదివిస్తోంది. అమ్మకు వచ్చే డబ్బులతోనే మా కుటుంబం గడిచేది. అక్క నవ్యశ్రీ నర్సింగ్ చేస్తోంది. గతేడాది వరకు అక్కకు అమ్మ ఒడి డబ్బులు వచ్చేవి. నర్సింగ్ కోర్సు చేస్తున్నందున ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇస్తున్నారు. ఇప్పుడు నాకు అమ్మ ఒడి మంజూరైంది. జగన్ మామయ్య ఇచ్చే పథకాల వల్లనే బడికి రాగలుగుతున్నాను. ఈ పథకాల వల్ల అమ్మకు కొంత ఆర్థిక భారం తగ్గింది. బాగా చదువుకొని అమ్మకు చేదోడుగా నిలవాలనేది నా లక్ష్యం.

– బచ్చు స్నేహశ్రీ, రైల్వే న్యూ కాలనీ

పాడిపంటతో జీవితం సాఫీగా..



నేను కృష్ణాపురం స్వయం సహాయక సంఘంలో సభ్యురాలిని. నా భర్త అప్పలనాయుడు కూలి పనిచేస్తుంటాడు. ఈ ఏడాది ప్రభుత్వం ఇచ్చిన రూ.56,250తో మూడు ఆవులు, రెండు గొర్రెలు కొని పెంచుతున్నాను. ఆవుల ద్వారా వస్తున్న పాలను స్థానికంగా ఉన్న విశాఖ డెయిరీకి అమ్ముతున్నాను. నెలకు రూ.15 వేలు వస్తోంది. అందులో రూ.8 వేలు రైల్వే ఉద్యోగం కోసం విజయవాడలో కోచింగ్ తీసుకుంటున్న నా కొడుకు సురేష్‌కు పంపిస్తున్నాను. మిగతా రూ.7వేలు కుటుంబం పోషణకు సరిపోతుంది. గొర్రె పిల్లల్ని అమ్మగా రూ.50 వేలు వచ్చాయి. ఆ డబ్బులతో నా రెండో కుమారుడిని డిగ్రీ, కుమార్తె శిరీషను ఇంటర్ చదివించాను. ఇదంతా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దయవల్లే.

– ముప్ప సన్యాసమ్మ, పద్మనాభం

వారంలో ధ్రువపత్రాలు వచ్చాయి



నా పేరు ప్రధాన్ భవాని. జీవనోపాధికి ఒడిశా నుంచి విశాఖ జిల్లాకు వచ్చాం. కంచరపాలెం రాజీవ్‌కాలనీలో ఉంటున్నాం. నాకు ముగ్గురు పిల్లలు. వారిని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాను. కుల, ఆదాయ ధ్రువపత్రాల కోసం తహసీల్దార్ కార్యాలయం, అధికారుల చుట్టూ కాళ్లు అరిగేలా తిరిగినా ప్రయోజనం కనిపించలేదు. నా పెద్ద కుమార్తె ఓపెన్ కేటగిరిలో ఫీజులు చెల్లించి ఉన్నత చదువులు పూర్తి చేసింది. నా రెండో కుమార్తె 2023 మార్చిలో పదో తరగతి మంచి మార్కులతో పూర్తి చేసింది. కానీ డబ్బులు కట్టి కళాశాలలో చదివించే స్తోమత మాకు లేదు. గత మే నెలలో గురుకుల కళాశాలలో ప్రవేశ పరీక్ష రాయగా ర్యాంక్ వచ్చింది. అదే సమయంలో దేవుడిలా 'జగనన్న సురక్ష' శిబిరాలు జరుగుతున్నాయని మా వలంటీర్ ద్వారా తెలుసుకొని కుల ధ్రువపత్రాల కోసం దరఖాస్తులు చేయగా వారం రోజుల్లోనే వచ్చేశాయి. ఇప్పుడు నా రెండో కూతురు మేఘాద్రిగెడ్డ అంబేడ్కర్ గురుకులంలో ఫస్ట్ ఇయర్ బైపీసీ చదువుతోంది. నా కుమార్తె విద్యాభ్యాసానికి జగనన్న శ్రీరామరక్షగా నిలవాలి. మళ్లీ ఆయనే సీఎంగా చూడాలని ఉంది.

– ప్రధాన్ భవాని, కంచరపాలెం

విద్యా దీవెనతోనే కాలేజీ చదువు



నా పేరు జి.లక్ష్మణ్. నాది శ్రీకాకుళం జిల్లా పాతపట్నం. మా జిల్లాలోనే ఇంటర్ పూర్తి చేసి, డిగ్రీ (బీఎస్సీ) విశాఖపట్నంలోని ప్రైవేటు కాలేజీలో చేరాను. డిగ్రీ కోర్సుకు ఏడాదికి రూ. 20 వేలు ఫీజు అయినప్పటికీ, జగనన్న విద్యా దీవెన పథకం డబ్బులు వస్తాయనే ధైర్యంతో ఇక్కడి వరకు వచ్చి చదువుకుంటున్నాను. అనుకున్నట్లుగానే ఈ ఏడాది విద్యా దీవెన డబ్బులు మంజూరయ్యాయి. వసతి దీవెన కూడా వస్తుందని మా కాలేజీ వారు చెప్పారు. కాలేజీ వారు కూడా విద్యా దీవెన డబ్బులు వచ్చిన తరువాతనే ఫీజు చెల్లించేలా అంగీకరించారు. దీంతో ధైర్యంగా డిగ్రీ కోర్సులో చేరాను.

– జి.లక్ష్మణ్, డిగ్రీ విద్యార్థి

మా ఊరికి బస్సు వచ్చింది



పీఎంపాలెంకి 5 కి.మీ దూరంలో జీవీఎంసీ మధురవాడ జోన్ 6వ వార్డు శంభువానిపాలెం గిరిజన గ్రామం మాది. చుట్టూ కొండలు, ఎటుచూసినా అభయారణ్యం, వన్యమృగాల మధ్య కుటుంబాలతో నివాసం ఉంటున్నాం. టీడీపీ ప్రభుత్వ హయాంలో గంటా శ్రీనివాసరావు బస్సు వేయిస్తామని చెప్పారు కాని వేయలేదు. రాష్ట్రంలో అన్ని ప్రాంతాల అభివృద్ధి మాదిరిగానే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మా గిరిజన ప్రాంతంపై దృష్టి సారించారు. మా గ్రామానికి బస్సు వేయించారు. మా గ్రామ ప్రజల దశాబ్దాల కల నెరవేరింది. మా ముందు తరాలు ఎక్కడికి వెళ్లాలన్నా నడిచి వెళ్లేవారు. అందుకే మా ఊరిలో చాలా మంది పెద్ద చదువులు చదువుకోలేదు. బస్సు రావడంతో పట్నంలో చదువులు, పనుల కోసం సులువుగా వెళ్లగలుగుతున్నాం. 2023 సంవత్సరాన్ని మా ఊరు ప్రజలు ఎప్పటికీ గుర్తుంచుకుంటారు.

– కాములెంక నూకలక్ష్మి, శంభువానిపాలెం

న్యూస్‌రీల్

గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు ఘనస్వాగతం



గవర్నర్ నజీర్‌కు స్వాగతం పలుకుతున్న జేసీ విశ్వనాథన్

తాటిచెట్లపాలెం: వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రలో పాల్గొనేందుకు రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ బుధవారం వేకువజామున విశాఖపట్నం చేరుకున్నారు. రైలు మార్గం ద్వారా విశాఖ చేరుకున్న ఆయనకు జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్ పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

అప్పన్న హుండీ ఆదాయం రూ.2.06 కోట్లు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న ఉద్యోగులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి హుండీ ఆదాయం గడిచిన 30 రోజులకు గాను రెండు కోట్ల ఆరు లక్షల 69 వేల 033 రూపాయలు వచ్చినట్టు దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి తెలిపారు. సింహగిరిపై బుధవారం హుండీ ఆదాయాన్ని లెక్కించారు. నగదుతో పాటు 120.500 గ్రాముల బంగారం, 10.630 కిలోల వెండి లభించినట్టు పేర్కొన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగిన లెక్కింపులో దేవస్థానం ఉద్యోగులు, పలు స్వచ్ఛంద సంస్థల సభ్యులు పాల్గొన్నారు.

ఐఎన్‌ఎస్ కళింగ కమాండింగ్ ఆఫీసర్‌గా ప్రదీప్ పటేల్



కమాండింగ్ ఆఫీసర్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న ప్రదీప్ పటేల్

తగరపువలస: భీమిలిలోని తూర్పుతీర నేవల్ స్టేషన్ కళింగ కమాండింగ్ ఆఫీసర్‌గా ప్రదీప్ పటేల్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రదీప్ పటేల్ 1996లో నేవీలో ప్రవేశించి తూర్పు, పశ్చిమ తీర నేవల్ కమాండింగ్ పరిధిలోని రంజిత్, ప్రళయ, టబర్, త్రిఖండ్ తదితర వార్‌షిప్‌లలో విధులు నిర్వర్తించారు. పశ్చిమ తీరంలో ఫ్లీట్ ఎలక్ట్రికల్ ఆఫీసర్‌గా పనిచేశారు. బంగ్లాదేశ్ జూనియర్ స్టాఫ్ కళాశాల, సీడీఎస్‌సీలో ఐటీ మేనేజ్‌మెంట్, వెల్లింగ్‌టన్–మద్రాసు విశ్వవిద్యాలయంలో డిఫెన్స్ అండ్ స్ట్రాటజీస్‌లో పోస్ట్ గ్రాడ్యుయేషన్, ముంబయి ఎన్‌హెచ్‌సీసీలో ఎంఫిల్ పూర్తి చేశారు. 2003లో నేవల్ స్టాఫ్ చీఫ్‌గా, 2001, 2008లో ఫ్లాగ్ ఆఫీసర్ కమాండింగ్ ఇన్ చీఫ్‌గా, ఐఎన్ఎస్ త్రిఖండ్‌లో వెపన్ సిస్టమ్‌లో ఎలక్ట్రికల్ ఆఫీసర్ విధులు నిర్వర్తించారు. కాగా.. కమాండర్ సీఎస్ నాయర్ నుంచి ఆయన బాధ్యతలు స్వీకరించారు.

29న మెగా జాబ్‌మేళా

కంచరపాలెం: జిల్లా ఉపాధి కార్యాలయం నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో ఈ నెల 29న మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి సీహెచ్ సుబ్బిరెడ్డి(క్లరికల్) తెలిపారు. ఆర్‌ఎస్ టెక్నాలజీస్, హెటిరో డ్రగ్స్, ఎంఏఎస్ మెరైన్ సర్వీసెస్, ఇ–జోన్ సెక్యూరిటీ, డెక్కన్ ఫైన్ కెమికల్స్, ల్యాండ్ మార్క్ గ్రూప్, ఫ్లిప్‌కార్ట్, రిలయన్స్ ట్రెండ్స్, పేటీఎం, ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంక్ ప్రైవేట్ లిమిటెడ్ తదితర కంపెనీల్లో 1,936 ఖాళీల భర్తీకి ఇంటర్వ్యూలు ఏర్పాటు చేశారు. సాఫ్ట్‌వేర్ డెవలపర్, జూనియర్ కెమిస్ట్, పోర్ట్ సర్వేయర్, ఫీల్డ్ సేల్స్ ఎగ్జిక్యూటివ్, రిటైల్ ట్రెనింగ్ అసోసియేట్, ఫార్మసిస్ట్, జూనియర్ ట్రైనీ, డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్స్, ఆఫీస్ అసిస్టెంట్, అకౌంట్స్, టెలీకాలర్, అసిస్టెంట్, రికవరీ క్లర్క్, బ్రాంచ్ ఇన్‌చార్జి, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగాలకు టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిప్లమో, ఏదైనా డిగ్రీ, పీజీ చేసిన వారు అర్హులు. 18–35 ఏళ్ల వయసు కలిగిన పురుష, మహిళా అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరుకావచ్చు.

బ్రిడ్జి కోర్సు శిక్షణకు దరఖాస్తులు

కంచరపాలెం: పాలిటెక్నిక్ ద్వితీయ సంవత్సరంలో ప్రవేశం పొందేందుకు ఐటీఐ రెండేళ్ల కోర్సు పూర్తి చేసిన అభ్యర్థులకు అవకాశం కల్పించే బ్రిడ్జి కోర్సు కోసం దరఖాస్తులు చేసుకోవాలని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ కేంద్రం(ఐటీఐ) ప్రిన్సిపాల్ జె.శ్రీకాంత్ తెలిపారు. జనవరి 2 నుంచి 31 వరకు బ్రిడ్జి కోర్సు ట్రెనింగ్ ప్రోగ్రాం ఉంటుందన్నారు. ఈ నెల 31లోగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు ట్రెనింగ్ ఆఫీసర్ సిహెచ్.లలిత కుమారి(కోపా ట్రేడ్) కంచరపాలెం పాత ఐటీఐలో సంప్రదించాలని కోరారు.

మహిళల కోసం ప్రత్యేక మరుగుదొడ్లు

పింక్ మొబైల్ టాయిలెట్లను ప్రారంభించిన మేయర్



పింక్ మొబైల్ టాయిలెట్లను ప్రారంభిస్తున్న మేయర్ హరివెంకటకుమారి

డాబాగార్డెన్స్: నగరంలో మహిళల కోసం ప్రత్యేకంగా పింక్ మొబైల్ టాయిలెట్లను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు మేయర్ గొలగాని హరి వెంకట కుమారి తెలిపారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయం వద్ద బుధవారం రెండు పింక్ మొబైల్ టాయిలెట్లను డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, జీవీఎంసీ వైఎస్సార్ సీపీ ఫ్లోర్ లీడర్ బానాల శ్రీనివాసరావుతో కలిసి ప్రారంభించారు. వాహనాల్లో ఏర్పాటు చేసిన సౌకర్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ జీవీఎంసీకి చెందిన రెండు బస్సులను సుమారు రూ.11.5 లక్షలతో పింక్ మొబైల్ టాయిలెట్లుగా ఆధునికీకరించినట్లు చెప్పారు. స్వచ్ఛ విశాఖే లక్ష్యంగా టాయిలెట్ 2.0 చాలెంజ్‌లో భాగంగా నగరంలో 20 టాయిలెట్లను ప్రత్యేకంగా అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా రెండు పింక్ మొబైల్ టాయిలెట్లను ప్రారంభించినట్లు చెప్పారు. ఈ టాయిలెట్లలో మహిళల కోసం బాత్రూం, ఇండోర్ లైటింగ్, ఫ్యాన్, శానిటరీ ప్యాడ్, వెండింగ్ మిషన్, ఇన్సినరేటర్‌తో కూడిన డైపర్ డిస్పెన్సరీ, తగిన సీట్లతో కూడిన బేబీ ఫీడింగ్ రూమ్ వంటి సౌకర్యాలు కల్పించినట్లు వెల్లడించారు. బీచ్‌రోడ్డు, రద్దీ ప్రాంతాలు, పబ్లిక్ మీటింగ్‌ల వద్ద ఇవి అందుబాటులో ఉంటాయన్నారు. ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్ కుమార్, యూసీడీ పీడీ పాపునాయుడు, ఏఎంవోహెచ్ డాక్టర్ కిశోర్, పర్యవేక్షక ఇంజినీర్(మెకానికల్) కృష్ణారావు, కార్యనిర్వాహక ఇంజినీర్ దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

హనుమంతవాక జంక్షన్‌లో ఫ్లైఓవర్

ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కమిషనర్ ఆదేశం



పీఎంపాలెం వద్ద సెంట్రల్ మీడియన్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ సాయికాంత్‌వర్మ

డాబాగార్డెన్స్: పీఎంపాలెం నుంచి షీలానగర్ వరకు జాతీయ రహదారి మరమ్మతులతో పాటు పలుచోట్ల బీటీ రోడ్లు వేయాలని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. పీఎంపాలెం నుంచి షీలానగర్ వరకు జాతీయ రహదారిని జీవీఎంసీ ప్రధాన ఇంజినీర్ రవికృష్ణరాజు, నేషనల్ హైవే ప్రాజెక్టు డైరెక్టర్ ప్రభాత్ రంజన్‌తో కలిసి బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వెంకోజీపాలెం నుంచి డైరీ ఫాం వరకు నేషనల్ హైవే మరమ్మతులకు గురైనందున.. ఓ పొర తారు రోడ్డు వెంటనే వేయాలని ఆదేశించారు. హనుమంతవాక జంక్షన్‌లో ఫ్లైఓవర్ నిర్మించేందుకు నేషనల్ హైవే అధికారుల ద్వారా ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. జాతీయ రహదారిలో పచ్చదనాన్ని పెంపొందించేందుకు చర్యలు చేపట్టడంతో పాటు మొక్కల సంరక్షణకు గ్రీన్‌బెల్ట్ ప్రదేశాల్లో అవసరమైన చోట చైన్ లింక్ మెస్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు. సెంట్రల్ మీడియన్‌లలో అనధికార హోర్డింగ్‌లు, ఫ్లెక్సీలు వెంటనే తొలగించాలని పట్టణ ప్రణాళికా అధికారులను ఆదేశించారు. జీవీఎంసీ పర్యవేక్షక ఇంజినీర్ శ్యాంసన్‌రాజు, డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ హార్టికల్చర్ ఎం.దామోదరరావు, జోనల్ కమిషనర్లు కనకమహాలక్ష్మి, ఆర్‌జీవీ కృష్ణ, కార్యనిర్వాహక ఇంజినీర్లు శాంతిరాజు, తారాప్రసన్న, మత్స్యరాజు పాల్గొన్నారు.

విలువలతో కూడిన విద్య అవసరం

గవర్నర్ అబ్దుల్ నజీర్ సతీమణి సమీరా నజీర్



విశాఖ వేలీ స్కూల్‌లో మాట్లాడుతున్న ఏపీ గవర్నర్ సతీమణి సమీరా నజీర్



గీతాలు ఆలపిస్తున్న విద్యార్థులు

ఆరిలోవ: విద్యార్థులకు విలువలతో కూడిన విద్య అందించాలని రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ సతీమణి సమీరా నజీర్ తెలిపారు. విశాఖ వేలీ స్కూల్‌ను ఆమె కలెక్టర్ మల్లికార్జున సతీమణి డాక్టర్ నిహారిక, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ సతీమణి డాక్టర్ పృథ్వీతో కలసి బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఈశ్వరి ప్రభాకర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు వారికి సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సమీరా నజీర్ మాట్లాడుతూ భారతదేశ సంస్కృతిని కాపాడే విధంగా విద్యార్థులు నడుచుకోవాలన్నారు. విద్యార్థులు పుస్తకాల ద్వారా ప్రాచీన భారతదేశ చరిత్ర తెలుసుకోవచ్చన్నారు. దేశ గౌరవాన్ని నిలబెట్టే పరిజ్ఞానం అందరికీ అవసరమన్నారు. విద్యార్థులు చదువు మీద శ్రద్ధ పెట్టాలన్నారు. సెల్‌ఫోన్లు, యూ ట్యూబ్ ఎక్స్(ట్విట్టర్) చూడవద్దని ఆమె సూచించారు. చదువు అనేది ఉద్యోగం కోసం మాత్రమే కాకుండా విజ్ఞానం సంపాదించాలనే ఆలోచనతో ఉండాలన్నారు. చదువు ఆర్థిక పరిస్థితిలో మార్పు తీసుకొస్తుందన్నారు. భారతదేశంలో వర్సిటీలు విజ్ఞానం అందించడంలో ప్రపంచం వర్సిటీలతో పోటీ పడుతున్నాయన్నారు. అనంతరం కలెక్టర్ సతీమణి, నిహారిక, జీవీఎంసీ కమిషనర్ సతీమణి పృథ్వీ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలన్నారు. క్రమశిక్షణ మనిషిని ఉన్నత స్థాయికి తీసుకెళ్తుందన్నారు. ప్రిన్సిపాల్ ఈశ్వరి ప్రభాకర్ మాట్లాడుతూ పాఠశాల సాధించిన విజయాలు, పాఠశాల అభివృద్ధికి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున చేస్తున్న కృషి గురించి వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నృత్యాలు చేయడంతోపాటు పాటలు పాడి అలరించారు.

ఇబ్బందులు లేకుండా భూ సేకరణ

గంగవరం పోర్టు–తుంగ్లాం రోడ్డు నిర్మాణంపై కలెక్టర్ మల్లికార్జున సమీక్ష



మాట్లాడుతున్న కలెక్టర్ మల్లికార్జున. చిత్రంలో గాజువాక ఎమ్మెల్యే నాగిరెడ్డి, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, జేసీ విశ్వనాథన్

మహారాణిపేట: సాగరమాల ప్రాజెక్టులో భాగంగా నిర్మించ తలపెట్టిన గంగవరం పోర్టు–తుంగ్లాం హైవే రోడ్డు నిర్మాణంపై కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున సమీక్షించారు. గాజువాక, ఆటోనగర్ పరిధిలోని ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ రద్దీ తగ్గించేందుకు గంగవరం అదానీ పోర్టు నుంచి కార్గో వాహనాల రాకపోకలకు అనువుగా ఈ రోడ్డును ప్రతిపాదించారు. స్థానిక ప్రజలు, పరిశ్రమల నిర్వాహకుల నుంచి వచ్చిన విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకొని మార్చిన అలైన్‌మెంట్, కొత్త డీపీఆర్ రూపకల్పనపై వీఎంఆర్డీఏ సమావేశ మందిరంలో బుధవారం ఆయన ప్రత్యేకంగా సమీక్షించారు. ఎవ్వరికీ ఇబ్బంది లేకుండా భూసేకరణ చేపట్టి, బహుళ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని రోడ్డు నిర్మాణం చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గతంలో రూపొందించిన డీపీఆర్‌పై స్థానిక ప్రజలు, ప్రజాప్రతినిధులు, పారిశ్రామికవేత్తల నుంచి వచ్చిన అభ్యంతరాలను పరిగణలోకి తీసుకుని.. డిజైన్‌లో మార్పులు చేసినట్లు ఎన్‌హెచ్ఏఐ అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. రైల్వే, ఇరిగేషన్, స్టీల్‌ప్లాంట్, ఆర్‌అండ్‌బీ అధికారులతో సంయుక్త క్షేత్రస్థాయి పరిశీలన చేశామన్నారు. తదుపరి చేపట్టబోయే చర్యల గురించి వివరించారు. ప్రస్తుతం గంగవరం పోర్టు గేటు ముందు భాగం నుంచి తుంగ్లాం వరకు 10.230 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణం చేపట్టనున్నట్లు వెల్లడించారు. అన్ని విభాగాల అధికారుల సమన్వయంతో వ్యవహరించి రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని, భవిష్యత్‌లో ట్రాఫిక్ రద్దీ లేకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులకు సూచించారు.

సమావేశంలో గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ, జాయింట్ కలెక్టర్ కె.ఎస్. విశ్వనాథన్, ఆర్డీవో డి.హుస్సేన్ సాహెబ్, ఎన్‌హెచ్ఏఐ పీడీ ప్రభత్ రంజన్, గంగవరం అదానీ పోర్టు సీఈవో బీజీ గాంధీ, హెచ్‌ఆర్ హెడ్ సీఎస్ రాజు, వివిధ శాఖల అధికారులు, కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

డ్రగ్స్ రవాణాను అరికట్టేందుకు పటిష్ట చర్యలు

- రెండేళ్లుగా తగ్గుతున్న కేసులు
- పోలీస్ శాఖ చర్యలతో సత్ఫలితాలు
- వార్షిక సమీక్ష సమావేశంలో కలెక్టర్ మల్లికార్జున



మాట్లాడుతున్న కలెక్టర్ మల్లికార్జున. చిత్రంలో సీపీ రవిశంకర్, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్

విశాఖ సిటీ: జిల్లాలో మాదక ద్రవ్యాల రవాణాను అరికట్టేందుకు పోలీసుశాఖ తీసుకున్న చర్యల ఫలితంగా దాదాపు రెండేళ్లుగా కేసులు తగ్గుతూ వస్తున్నాయని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున పేర్కొన్నారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో బుధవారం జిల్లా స్థాయి వార్షిక నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి కలెక్టర్‌తో పాటు నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్, జీవీఎంసీ కమిషనర్ సి.ఎం.సాయికాంత్ వర్మ, జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్, డీసీపీలు కె.శ్రీనివాసరావు, పి.వెంకటరత్నం, కె.ఆనంద్ రెడ్డి, ఇతర రెవెన్యూ, జ్యుడీషియల్, పలు శాఖల అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా స్థాయి కమిటీ సభ్యుల సూచనల మేరకు పోలీసు శాఖ తీసుకున్న చర్యలు సత్ఫలితాలు ఇస్తున్నాయని తెలిపారు. మాదకద్రవ్యాలపై చేపడుతున్న అవగాహన కార్యక్రమాలతో ప్రజలు, కళాశాల విద్యార్థుల్లో చైతన్యం వస్తోందన్నారు. వీఎంఆర్‌డీఏ, జీవీఎంసీ, పోలీసు శాఖల సహకారంతో నగరంలో ట్రాఫిక్ సమస్యలు తగ్గి ప్రమాదాల సంఖ్య కూడా తగ్గుముఖం పట్టినట్లు చెప్పారు.

జిల్లాలో గట్టి నిఘా : సీపీ రవిశంకర్

నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ మాట్లాడుతూ జిల్లాలో మాదక ద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టేందుకు గట్టి నిఘాతో పాటు పటిష్ట చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. నగర పోలీసు అధికారులు మరింత సమర్థవంతంగా పోలీసింగ్ చేయడానికి చేపట్టాల్సిన విధానాలను వివరించారు. ఈ ఏడాది కాలంలో నగరంలో లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్, క్రైమ్‌లపై ఆయా అధికారులతో విశ్లేషించిన ఆయన ఉత్తమ పోలీసింగ్ కోసం వచ్చే సంవత్సరంలో తీసుకోవాల్సిన చర్యలను విశదీకరించారు. సమావేశంలో ఎస్ఈబీ అడిషనల్ ఎస్పీ బి.శ్రీనివాసరావు, డీటీసీ జి.సి.రాజారత్నం, ఆర్డీవోలు హుస్సేన్ సాహెబ్, భాస్కర రెడ్డి, ఎన్‌హెచ్ఏఐ ప్రాజెక్ట్ డైరెక్టర్ ప్రభాత్ రంజన్, డీఈవో కె.చంద్రకళ, సమగ్ర శిక్ష అభియాన్ ఏపీసీ శ్రీనివాసరావు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

మూడో గురువారం పూజలకు ఏర్పాట్లు

డాబాగార్డెన్స్: మార్గశిర మాసోత్సవ మూడో గురువారం కనకమహాలక్ష్మి అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు తగిన ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఈవో కె.శిరీష తెలిపారు. ఆలయ ప్రాంగణంతో పాటు పరిసర ప్రాంతాల్లో సీసీ కెమెరాలు, రీడింగ్ రూమ్ ఎదురుగా ఉన్న రోడ్డులో తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేశామన్నారు. మంచినీటి సౌకర్యం కల్పించినట్లు చెప్పారు. పలు దేవాలయాల నుంచి సిబ్బందిని డిప్యూటేషన్‌పై తీసుకొచ్చామని, ఆలయ పరిసర ప్రాంతమంతా ఎప్పటికప్పుడు శుభ్రపరిచేలా జీవీఎంసీ సహకారం తీసుకున్నట్లు తెలిపారు. కాగా.. రీడింగ్ రూమ్ వద్ద ధర్మదర్శనంతో పాటు రూ.100, రూ.200, రూ.500 క్యూ టికెట్లు ఇస్తారు. సీతారామస్వామి ఆలయం వైపు నుంచి వీవీఐపీ, వీఐపీతో పాటు వృద్ధులు, వికలాంగులు, రూ.200, రూ.500 టికెట్ తీసుకున్న వారికి దర్శనం కల్పించనున్నారు. అమ్మవారి ఆలయ వెనుకభాగం, ఆలయ ప్రధాన ద్వారం(వీటీ కాలేజ్ వద్ద), దర్శనం అనంతరం బయటకు వచ్చే మార్గంలో ప్రసాద కౌంటర్లు ఏర్పాటు చేశారు.

ట్రాఫిక్ మళ్లింపు ఇలా..

అమ్మవారి దర్శనానికి పెద్ద ఎత్తున భక్తులు తరలి రానున్న దృష్ట్యా ట్రాఫిక్ పోలీసులు తగిన చర్యలు తీసుకున్నారు. జగదాంబ జంక్షన్ మీదుగా అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులు ఏవీఎన్ కాలేజ్ డౌన్‌రోడ్డు నుంచి టౌన్‌కొత్తరోడ్డు ముందు సందు వద్ద కుడివైపు తిరిగి సూయిజ్‌ఫాం చేరుకోవాలి.


సిరులతల్లికి ప్రత్యేక పూజలు

అక్కడే వాహనాలు పార్కు చేసి కాలి నడకన అమ్మవారి గుడికి రావాలి.

- కాన్వెంట్ జంక్షన్, అద్వానీ జంక్షన్, రామకృష్ణ జంక్షన్ మీదుగా వచ్చే వాహనాలు సీహార్స్ జంక్షన్ నుంచి టౌన్‌కొత్తరోడ్డు ముందు పార్కింగ్ చేసుకుని కాలినడకన రావాలి.
- వన్‌టౌన్, పాత పోస్టాఫీస్ జంక్షన్ల మీదుగా అమ్మవారి గుడికి వచ్చే ద్విచక్ర వాహనచోదకులు లక్ష్మీటాకీస్, ఎంవీడీఎం హైస్కూల్ మీదుగా కురుపాం మార్కెట్ మెయిన్‌రోడ్డు కిరువైపులా పార్క్ చేసుకోవాలి.
- వన్‌టౌన్, పాత పోస్టాఫీస్ జంక్షన్ల మీదుగా అమ్మవారి ఆలయానికి వచ్చే నాలుగు చక్రాల వాహనదారులు కురుపాం మార్కెట్‌లోని ఖాళీ స్థలంలో పార్క్ చేసుకోవాలి.
- వీఐపీలు, రూ.500 టికెట్ తీసుకునే వారు బీచ్ రోడ్డు మీదుగా టౌన్ హాల్‌కు చేరుకుని.. అక్కడే తమ వాహనాలను పార్క్ చేసుకోవాలి.

అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు

మార్గశిర మాసోత్సవాల్లో భాగంగా బుధవారం కనకమహాలక్ష్మి అమ్మవారిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. అమ్మవారికి ఉదయం 5 నుంచి 6 గంటల వరకు పంచామృతాభిషేకం, సహస్రనామార్చన, 6 నుంచి 11 గంటల వరకు సర్వదర్శనం, 11.30 నుంచి 12 గంటల వరకు పంచామృతాభిషేకం, మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు సర్వదర్శనం, 6 నుంచి 7 గంటల వరకు విశేష పంచామృతాభిషేకం, అష్టోత్తర నామార్చన పూజ నిర్వహించారు. పలువురు ఉభయదాతలు అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొన్నారు. మార్గశిర గురువారాల్లో త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనాలంటే భక్తులు రూ.7,500 చెల్లించాలని ఈవో తెలిపారు. టౌన్‌కొత్తరోడ్డు సమీపంలోని జగన్నాథస్వామి ఆలయంలో మూడు వేల మంది భక్తులకు అన్నసమారాధన చేశారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. ఏఈవో కె.తిరుమలేశ్వరరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

'పీఎఫ్ అదాలత్' తో తక్షణ పరిష్కారం


మాట్లాడుతున్న రామకృష్ణ

మురళీనగర్: నిధి ఆప్ కే నికట్ (పీఎఫ్ అదాలత్) ద్వారా సమస్యలకు అక్కడికక్కడే పరిష్కారం కుదురుతుందని ఈపీఎఫ్ జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి వి.రామకృష్ణ తెలిపారు. పీఎఫ్ ఖాతాదారులు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బిర్లా కూడలి లక్ష్మీ హ్యుందాయ్‌లో బుధవారం నిర్వహించిన పీఎఫ్ అదాలత్‌లో ఆయన మాట్లాడారు. ప్రతి నెలా 27న జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. ఆ రోజు సెలవు అయితే తర్వాత రోజు కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఇందులో ఖాతాదారులు పీఎఫ్ సంబంధిత సమస్యలపై దరఖాస్తులు ఇవ్వవచ్చని చెప్పారు. వారం రోజుల ముందుగానే వేదిక వివరాలు తెలుపుతామని, విశాఖపట్నం రీజినల్ కార్యాలయం నోటీస్ బోర్డులో వివరాలు ప్రదర్శిస్తామని తెలిపారు. అదాలత్‌లో వివిధ సమస్యలకు సంబంధించి 12 దరఖాస్తులు రాగా 11 సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. సీనియర్ సోషల్ సెక్యూరిటీ అసిస్టెంట్లు టి.నాగేశ్వరరావు, ఎస్.ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

ప్రభుత్వ లక్ష్యాలు నెరవేర్చాలి

బ్యాంకర్లతో కలెక్టర్ మల్లికార్జున

మహారాణిపేట: రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా బ్యాంకర్లు ప్రజలకు సేవలందించాలని, రుణ మంజూరు ప్రక్రియలో సులభతర విధానాలు అమలు చేయాలని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున కోరారు. పెండింగ్ దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం ఆయన అధ్యక్షతన జిల్లా సమీక్ష సమావేశం జరిగింది. స్వయం ఉపాధి యూనిట్ల ఏర్పాటు, ఇళ్ల నిర్మాణాలకు రుణ మంజూరు, సిబిల్ స్కోర్ విధానం, కిసాన్ క్రెడిట్ కార్డుల పంపిణీ, స్త్రీ నిధి రుణ ప్రక్రియ తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే పాలసీకి అనుగుణంగా బ్యాంకర్లు వ్యవహరించాలని, ప్రజలకు సులభతర రీతిలో సేవలందించాలని సూచించారు. ప్రధానంగా స్వయం ఉపాధి యూనిట్లు స్థాపించుకునే వారికి, జగనన్న పేదలందరికీ ఇళ్లు, టిడ్కో పథకంలో భాగంగా నిర్మాణాలు చేపట్టే లబ్ధిదారులకు సంపూర్ణ సహకారం అందించాలన్నారు. టిడ్కో లబ్ధిదారులకు రుణం మంజూరు చేసే క్రమంలో సిబిల్ స్కోర్ ఉండాలనే నిబంధనలో వీలును బట్టి సడలింపు ఇవ్వాలన్నారు. ఎంఎస్ఎంఈ సెక్టార్లలో వ్యాపార కార్యకలాపాలు నిర్వహించే వారికి సహకరించాలన్నారు. బ్యాంకర్లు, ప్రభుత్వ అధికారులు సమన్వయంతో వ్యవహరించి.. ప్రభుత్వ లక్ష్యాలు చేరుకునేందుకు కృషి చేయాలన్నారు. అనంతరం నాబార్డు రూపొందించిన పొటెన్షియల్ లింక్డ్ క్రెడిట్ ప్లాన్ బుక్‌ను కలెక్టర్, అధికారులు ఆవిష్కరించారు. సమీక్షలో ఎల్‌డీఎం శ్రీనివాస్, ఆర్‌బీఐ ప్రతినిధి పూర్ణిమ, నాబార్డు జిల్లా అభివృద్ధి మేనేజర్ సమంత్ కుమార్, వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాంకుల ప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ మల్లికార్జున

కేంద్రం దిగి వచ్చే వరకు ఉద్యమం



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న పోరాట కమిటీ ప్రతినిధులు

- స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు
- 1000వ రోజుకు ఉక్కు రిలే దీక్షలు
- డీఆర్‌ఎం ఆఫీస్ నుంచి గాంధీ విగ్రహం వరకు భారీ ర్యాలీ

సీతమ్మధార : విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగిస్తామని ప్రధాని నరేంద్రమోదీ ప్రకటించే వరకు ఉద్యమం ఆగదని స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్, సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సి.హెచ్. నర్సింగరావు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద కొనసాగుతున్న దీక్షా శిబిరానికి వెయ్యి రోజులు పూర్తయిన సందర్భంగా డీఆర్‌ఎం ఆఫీస్ నుంచి జీవీఎంసీ గాంధీ విగ్రహం వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. జేఏసీ చైర్మన్ ఎం.జగ్గునాయుడు, వైస్ చైర్మన్ మన్మథరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నర్సింగరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను జిందాల్‌కు కట్టబెట్టేందుకు రహస్య ఒప్పందం చేసుకుందన్నారు. బీజేపీ ఎంపీ జీవీఎల్ నర్సింహారావు విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించడం లేదని ప్రకటించడాన్ని తప్పు బట్టారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు ఆదినారాయణ, వెంకట సుబ్బయ్య, ఐఎన్‌టీయూసీ ప్రతినిధి నాగభూషణం, ఐఎఫ్‌టీయూ నాయకులు వెంకటేశ్వర్లు, సీఎఫ్‌టీయూఐకి చెందిన సురేష్‌బాబు, టీఎన్‌టీయూసీ ప్రతినిధి రామ్మోహన్‌రావు, ఐద్వా జిల్లా అధ్యక్షులు బి.పద్మ, పీవోడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షులు లక్ష్మి, బొడ్డు కళ్యాణరావు, దొమ్మేటి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.


కూర్మన్నపాలెం జంక్షన్ వద్ద నినాదాలు చేస్తున్న పోరాట కమిటీ నాయకులు

ఉక్కుదీక్షకు మద్దతుగా భారీ బైక్ ర్యాలీ

కూర్మన్నపాలెం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నగరంలోని గాంధీ విగ్రహం వద్ద చేపట్టిన దీక్షలు 1000 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా కూర్మన్నపాలెం దీక్ష శిబిరం నుంచి పెద్ద ఎత్తున కార్మికులు భారీ బైక్ ర్యాలీగా వెళ్లి, సంఘీభావం తెలిపారు. పోరాట కమిటీ నాయకులు అయోధ్యరావ్ డి.ఆదినారాయణ నీరుకొండ రామచంద్రరావు, స్టీల్ అఖిలపక్ష కార్మిక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో యువజన విభాగానిదే కీలకపాత్ర

ఎంవీపీకాలనీ: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో యువజన విభాగం కీలకపాత్ర పోషించాలని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఆళ్ల శివగణేష్ పిలుపునిచ్చారు. పార్టీ యువజన విభాగం మండల అధ్యక్షులతో బుధవారం లాసన్స్ బే కాలనీలోని కార్యాలయంలో సమావేశం జరిగింది. ఆళ్ల శివగణేష్ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో వైఎస్సార్ సీపీ యువజన విభాగం ప్రతినిధులు పార్టీకి విలువైన సేవలు అందించేందుకు శ్రమించాలన్నారు. ప్రతి సచివాలయం పరిధిలో గృహసారథులు, కన్వీనర్లు, యువజన విభాగం అధ్యక్షులు నిత్యం ప్రజలతో మమేకం అవుతూ.. పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. వైఎస్సార్ సీపీ అధినాయకత్వం ఉమ్మడి విశాఖ జిల్లాలో 30 మండలాలకు యువజన విభాగం నూతన అధ్యక్షులను నియమించడం హర్షణీయమన్నారు. అనంతరం ఆయా మండలాల యువజన విభాగం అధ్యక్షులు శివగణేష్‌ను సత్కరించారు.


శివగణేష్‌ను సత్కరిస్తున్న వైఎస్సార్ సీపీ యువజన విభాగం ప్రతినిధులు

'మాస్టర్స్ అథ్లెటిక్స్'లో మెరిసిన విశాఖ వాసులు

మురళీనగర్: ప్రకాశం జిల్లా రామయ్యపట్నం పోర్ట్ సమీపంలోని చర్చి గ్రౌండ్‌లో ఇటీవల నిర్వహించిన 43వ ఆంధ్రప్రదేశ్ స్టేట్ మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో నగర క్రీడాకారులు సత్తా చాటారు. రాష్ట్ర కార్యదర్శి మంగా ప్రసాద్ పర్యవేక్షణలో నిర్వహించిన పోటీల్లో మురళీనగర్ వాకర్స్ క్లబ్ కార్యదర్శి ఎల్‌వీ సుధాకర్ 200మీటర్ల పరుగు పందెంలో ప్రథమ, 100మీటర్లలో ద్వితీయ స్థానం సాధించారు. 5 కిలోమీటర్ల వాకింగ్‌లో స్వర్ణ పతకం, 400 మీటర్ల రిలేలో కాంస్య పతకం, హ్యామర్ త్రోలో రజతం సాధించారు. రాష్ట్ర కార్యదర్శి ఎం.రామారావు 5 కి.మీ వాకింగ్‌లో రజతం సాధించారు.

పోలీస్ శాఖ క్రీడాకారులకు పతకాల పంట

పోలీసు శాఖకు చెందిన ఐదుగురు క్రీడాకారులు పలు పతకాలు సాధించారు. ఎస్.జలు ఉష షాట్‌పుట్‌లో స్వర్ణ పతకం, జావెలిన్ త్రోలో స్వర్ణ పతకం, డిస్కస్ త్రోలో స్వర్ణ పతకం, 400మీ. రిలేలో కాంస్యం సాధించారు. కె.సీతామహలక్ష్మి 5కి.మీ వాకింగ్‌లో స్వర్ణం, హ్యామర్ త్రోలో స్వర్ణం, డిస్కస్ త్రోలో రజతం గెలుచుకున్నారు. ఎం.బాలరాజు లాంగ్‌జంప్‌లో స్వర్ణం, 200మీ. రన్నింగ్‌లో రజతం, ట్రిపుల్ జంప్‌లో కాంస్యం, సీహెచ్ సంతోష్ షాట్‌పుట్‌లో స్వర్ణం, 800మీ.రన్నింగ్‌లో రజతం, జావెలిన్ త్రోలో స్వర్ణం, టి.సుధాకర్ 400మీ రన్నింగ్‌లో స్వర్ణం, 100మీ.లో రజతం, డిస్కస్‌తో రజతం సాధించారు. డి.సరోజిని 5 కి.మీ. వాక్‌లో స్వర్ణం, 100మీ. విభాగంలో స్వర్ణం, 800 మీటర్ల విభాగంలో కాంస్యం గెలుచుకున్నారు. ఆర్.విమల షాట్‌పుట్‌లో రజతం, 5కే రన్నింగ్‌లో బంగారం, జావెలిన్ త్రోలో రజతం, వీరభద్రరావు హేమర్ త్రోలో బంగారం, డిస్కస్ త్రోలో రజతం, షాట్‌పుట్‌లో రజతం సొంతం చేసుకున్నారు. టీడీ శశి డిస్కస్ త్రోలో స్వర్ణం, హ్యామర్‌త్రో రజతం, ఎం.భాస్కర్ షాట్‌పుట్ స్వర్ణం, జావెలిన్ త్రోలో స్వర్ణం, డి.సూరిబాబు లాంగ్ జంప్‌లో స్వర్ణం, ఎం.సత్యారావు 5కి.మీ వాకింగ్‌లో ద్వితీయ స్థానం, 400మీ రన్‌లో రజతం సాధించారు. ఓవరాల్ చాంపియన్‌షిప్‌కు సంబంధించి విశాఖ క్రీడాకారులు ద్వితీయ స్థానాన్ని సాధించారు.


ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌లో ద్వితీయ స్థానంలో నిలిచిన విశాఖ క్రీడాకారులు

ఒకదాన్నొకటి ఢీకొన్న కార్లు

మధురవాడ: జాతీయ రహదారిపై కొమ్మాది జంక్షన్ వద్ద బుధవారం ఉదయం ఓ గ్యాస్ ట్యాంక్ సహా మూడు కార్లు వరుసగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో వాహనాలు పాక్షికంగా దెబ్బతిన్నాయి. ఓ కారు డ్రైవర్ స్వల్పంగా గాయపడ్డాడు. బుధవారం ఉదయం 6.15 గంటల సమయంలో కొమ్మాది సిగ్నల్ వద్ద విశాఖ నుంచి మారికవలస వైపు వాహనాలు వెళ్లే క్రమంలో ఈ ప్రమాదం సంభవించింది. వివరాలివీ.. సిగ్నల్ వద్ద ఓ ఆర్టీసీ బస్సు ఆగి ఉంది. దాని వెనకనే ఉన్న కారు డ్రైవర్ బ్రేక్ బదులు యాక్సిలరేటర్ తొక్కడంతో ముందు ఉన్న బస్సును స్వల్పంగా ఢీకొట్టాడు. ఆ సమయంలో వెనకే ఉన్న కారు ముందుకు వెళ్లిన ఈ కారును ఢీకొట్టింది. ఆ కారును తప్పించే క్రమంలో పక్కనే ఉన్న గ్యాస్ ట్యాంకర్‌ను మరో కారు స్వల్పంగా ఢీకొంది. మూడు కార్లు స్వల్పంగా దెబ్బతినడం తప్పితే.. ఎటువంటి ప్రాణాపాయం లేకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. కాసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.


వాహనాలు ఢీ కొనడంతో స్తంభించిన ట్రాఫిక్


దెబ్బతిన్న వాహనాలు

ఇన్‌స్టాలో పరిచయం.. మోసపోయిన యువతి

తెలంగాణ యువకుడిని అరెస్ట్ చేసిన పోలీసులు

అల్లిపురం: ఇన్‌స్టాగ్రామ్‌లో అమ్మాయితో పరిచయం పెంచుకుని.. మోసం చేసిన యువకుడిని మహారాణిపేట పోలీసులు బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ రమణమూర్తి తెలిపిన వివరాలివీ.. తెలంగాణ రాష్ట్రం, కుద్బుల్లాపూర్, జగద్గిరిగుట్ట ప్రాంతం లెనిన్‌నగర్‌కు చెందిన గుడ్డు రాజేష్.. నగరంలోని దండు బజార్‌కు చెందిన యువతితో ఇన్‌స్టాలో పరిచయం పెంచుకున్నాడు. తర్వాత ఫోన్ నంబర్లు మార్చుకుని చాటింగ్ మొదలు పెట్టాడు. ఆ పరిచయంతో 2022 అక్టోబర్‌లో నగరానికి వచ్చి ఆ అమ్మాయి రూమ్‌లో కొన్ని రోజులు ఉన్నాడు. తర్వాత నగరంలో ఓ బైక్ షోరూంలో ఉద్యోగంలో కుదిరాడు. 10 రోజుల తర్వాత ఉద్యోగం మానేశాడు. ఆ యువతి, ఆమె స్నేహితుల నుంచి ఫోన్‌పే ద్వారా రూ.20 వేల వరకు వాడుకున్నాడు. తర్వాత హైదరాబాద్ వెళ్లిపోయాడు. ఈ క్రమంలో యువతి గర్భం దాల్చడంతో ఆమె రాజేష్‌కు ఫోన్ చేసి విషయం చెప్పింది. అతని సూచనలతో గర్భ నిరోధక మాత్రలు వేసుకుంది. తర్వాత పెళ్లి చేసుకోవాలని యువతి రాజేష్‌ను డిమాండ్ చేయడంతో.. అతను ఆమె ఫోన్ నంబర్‌ను బ్లాక్‌లో పెట్టేశాడు. దీంతో ఆ యువతి రాజేష్ ఇంటికి వెళ్లి.. తల్లిదండ్రులకు విషయం తెలియజేసింది. వారు కుమారుడితో మాట్లాడి పెళ్లి చేస్తామని చెప్పారు. ఆ సమయంలో రాజేష్ ఆమె ఫోన్ తీసుకుని.. అందులో ఫొటోలు, కాల్ రికార్డులను డిలీట్ చేశాడు. ఇన్‌స్టా ప్రొఫైల్, అకౌంట్‌ను తొలగించాడు. ఫోన్‌ను ఫార్మాట్ కూడా చేయడంతో ఆమె విశాఖపట్నం తిరిగి వచ్చి మహారాణిపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. విచారణ చేపట్టి పోలీసులు బుధవారం నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

పశుసంవర్ధక శాఖలో క్లస్టర్ విధానం రద్దు

ఏపీ నాన్ గ్రాడ్యుయేట్ వెటర్నరీ ఫెడరేషన్ డిమాండ్

ఆరిలోవ: పశు సంవర్ధక శాఖలో డైరెక్టర్ అమలు చేస్తున్న క్లస్టర్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని ఏపీ నాన్ గ్రాడ్యుయేట్ వెటర్నరీ ఫెడరేషన్ విశాఖపట్నం చైర్మన్ ఎస్.అప్పారావు డిమాండ్ చేశారు. హనుమంతవాక వద్ద జిల్లా పశు సంవర్ధక శాఖ కార్యాలయంలో బుధవారం ఏపీ నాన్ గ్రాడ్యుయేట్ వెటర్నరీ ఫెడరేషన్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ క్లస్టర్ విధానం వల్ల నాన్ గ్రాడ్యుయేట్ వెటర్నరియన్లను శాఖలో పైస్థాయి అధికారులు హీనంగా చూస్తున్నారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో నాన్ గ్రాడ్యుయేట్ వెటర్నరియన్లు ఈ విధానాన్ని వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు. దీనిపై ప్రభుత్వం దృష్టిపెట్టి క్లస్టర్ విధానాన్ని రద్దు చేయాలని కోరారు. పశుసంవర్ధక శాఖకు సంచాలకుడిగా ఐఏఎస్ అధికారిని నియమించాలని, అలాంటప్పుడే కింది స్థాయిలో ఉద్యోగులకు న్యాయం జరుగుతుందన్నారు. సమావేశంలో ఫెడరేషన్ రాష్ట్ర సభ్యులు బోనం గోవిందరాజు, డి.కోదండరావు, వెటర్నరీ అసిస్టెంట్లు, ఎల్ఎస్ఏ, జేవీవో, వీఎల్‌వోల సంఘాల నాయకులు పి.స్వామినాయుడు, బి.శంకర్, భాస్కర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశమైన నాన్ గ్రాడ్యుయేట్ వెటర్నరీ సభ్యులు

చికెన్ ధరలు



చికెన్ (కిలో) (వెన్‌కాబ్)

ఫారం	: రూ.90
బ్రాయిలర్ (లైవ్)	: రూ.110
స్కిన్	: రూ.190
స్కిన్‌లెస్	: రూ.200

కోడిగుడ్ల ధరలు

రూ.లలో (వందకు)

విశాఖ	625.00
విజయనగరం	629.00
శ్రీకాకుళం	629.00